# సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 9 । జూలై । 2025




గరిష్టం/కనిష్టం
27.0/25.0

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## వాగు దాటితేనే వైద్యం

మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మార్గంలో వాగులు, ఒర్రెలపై వంతెనలు లేకపోవడంతో ఆదివాసీలకు రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. ఇంద్రవెల్లి మండలంలో ఓ చిన్నారిని తల్లిదండ్రులు అర్ధరాత్రి వాగు దాటి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన దుస్థితి. వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



- వివరాలు 8లో ▸

# వర్సిటీ.. కావాల్సిందే

- ఆవశ్యకతపై గొంతెత్తిన జిల్లావాసులు
- సంఘటితంగా ఉద్యమిస్తే సాధ్యమే
- విద్యా ప్రమాణాలు పెంపుకు దోహదం
- 'సాక్షి' చర్చా వేదికలో వక్తల అభిప్రాయం



చర్చావేదికకు హాజరైన విద్యావంతులు, మేధావులు

చదువులమ్మ ఆశీర్వాదం కోసం అడవితల్లి బిడ్డలది ఏళ్లుగా తప్పని నిరీక్షణ.. ఉన్నత విద్య అందుబాటులోకి రావాలన్నదే వారి ఆకాంక్ష.. యూనివర్సిటీ డిమాండ్ దశాబ్దాలుగా వినిపిస్తున్నా పాలకుల పట్టింపులేమితో నెరవేరని పరిస్థితి. ఈ క్రమంలో 'సాక్షి' సామాజిక బాధ్యతగా ముందడుగు వేసింది. వారి గొంతుకను వినిపించేందుకు సిద్ధమైంది. చర్చావేదికకు శ్రీకారం చుట్టి ఆయా వర్గాల వారికి ఆహ్వానం పలికింది. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. సంఘటితమై ఉద్యమిస్తే లక్ష్యం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

- ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్/కైలాస్‌నగర్/ ఆదిలాబాద్‌రూరల్/తాంసి/సాత్నాల/తలమడుగు

'ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఆవశ్యకత'పై జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన చర్చా వేదికకు అనూహ్య స్పందన లభించింది. విద్యావంతులు, మేధావులు, రిటైర్డు ఎంప్లాయిస్, డైట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది. వర్సిటీ లేకపోవడంతో జిల్లాకు జరుగుతున్న నష్టంతో పాటు దాన్ని సాధించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయం లేని ఏకైక జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ కావడం విచారకరమని పేర్కొన్నారు. వర్సిటీ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో విద్యా ప్రమాణాలు పెరుగుతాయని, తద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.




పాలకులపై ఒత్తిడి తెచ్చేలా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం 22 మంది సభ్యులతో కూడా అడహక్ కమిటీ సైతం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ కృష్ణకాంత్ గౌడ్, ఆర్సీ ఇన్‌చార్జి యేర సుధాకర్, సాక్షి వీడియో జర్నలిస్టు గంట వినోద్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ చింతల అరుణ్‌రెడ్డి, నంద సురేష్, ఎస్.రవి, వెంకటేశ్, సతీశ్‌రెడ్డి, మహేందర్, పోచ్చన్న, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు తొగరి భాస్కర్, రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

**అడహక్ కమిటీ ఏర్పాటు..**

యూనివర్సిటీ సాధన కోసం 22 మందితో అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా బద్దం పురుషోత్తంరెడ్డి, కోకన్వీనర్లుగా అన్నమొల్ల కిరణ్, తొగరి భాస్కర్, డాక్టర్ వరప్రసాద్, గొడిసెల రమణగౌడ్, డాక్టర్ ఉదారి నారాయణ, సభ్యులుగా అచ్చి శ్రీనివాస్, సోగాల సుదర్శన్, అగ్గిమల్ల గణేశ్, నిమ్మల నరేందర్, అల్లూరి భూమన్న, పి.హన్మాండ్లు, సామ రూపేష్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, నాగారాజు వేముల, ప్రవీణ్ కుమార్, రమేశ్, అయిండ్ల రంజిత్ రెడ్డి, తెలంగ్ గణేశ్, మేకల జితేందర్, ప్రభాకర్‌రెడ్డి, దర్శనాల మల్లేశ్, వెట్టి మనోజ్‌ను ఎంపిక చేసి ప్రకటించారు

### కలిసికట్టుగా పోరాడితేనే..



కలిసి కట్టుగా పోరాడితేనే యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యపడుతుంది. గతంలో ఉట్నూర్ కేంద్రంగా గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా చివరకు ఆది వేరే ప్రాంతానికి తరలిపోయింది. అలాగే 2008లో జిల్లాకు ఐఐటీ మంజూరు చేసి ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై కలెక్టరేట్ ఎదుట 54 రోజుల పాటు ఉద్యమించాం. ఫలితంగా బాసరకు ట్రిపుల్ ఐటీని కేటాయించారు.

– చిట్యాల సుహాసినిరెడ్డి, జెడ్పీమాజీ చైర్‌పర్సన్

### ఉన్నత విద్యకు దూరమవుతూ..



జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ముఖ్యంగా యువతులు డిగ్రీతోనే ఆగిపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తక్కువ, యూనివర్సిటీలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్ఈపీ 2020 ప్రకారం జిల్లాకు రెండు చొప్పున వర్సిటీలను ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరికి ఉన్నత విద్య అందే అవకాశం ఉంటుంది.

– అచ్చి శ్రీనివాస్, ప్రభుత్వ సైన్స్‌డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఇచ్చోడ

### ఉమ్మడి జిల్లాకు అన్యాయం..



రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల్లో యూనివర్సిటీలు ఉండగా ఆదిలాబాద్‌కు మాత్రం లేదు. ఇది చాలా అన్యాయం. సాక్షాత్తు చదువుల తల్లి కొలువై ఉన్న ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయం లేకపోవడం బాధాకరం. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా ముందుకు రావాలి. పాలకులు సైతం నిర్లక్ష్యం వీడాలి. ఈ ప్రాంత విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలి.

– రమణగౌడ్, జీకే ఫ్యాకల్టీ

### విద్యతోనే అభివృద్ధి



జిల్లా విద్యార్థులు దూర భారం కారణంగా ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. అదే స్థానికంగా యూనివరిటీ అందుబాటులో ఉంటే విద్యాభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు సైతం మెరుగుపడతాయి. విశ్వవిద్యాలయం సాధన కోసం ఏర్పాటు చేసిన అడ్‌హక్ కమిటీకి అన్ని విధాలుగా మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం. పాలకులు సైతం సానుకూలంగా స్పందించాలి.

– ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి విద్యాసంస్థల అధినేత

### అక్షర క్రమంలో ముందున్నా..



అక్షర క్రమంలో ఆదిలాబాద్ ముందున్నా అభివృద్ధిలో మాత్రం అంతంతే అన్న చందంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా జిల్లాకు వెంటనే యూనివర్సిటీ మంజూరు చేయాలి. ఆయా సంఘాలతో పాటు మేధావులు, పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు ఈ విషయంలో చొరవ చూపి ఐక్యంగా ముందుకు సాగాలి.

– పూసం సచిన్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకుడు

### 'సాక్షి' చొరవ అభినందనీయం



జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యత అంశాలను గుర్తించి ప్రత్యేక చర్చా వేదిక కార్యక్రమాలను 'సాక్షి' ఏర్పాటు చేయడం అభినందనీయం. గతంలో విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి డిబేట్ ఏర్పాటు చేసిన అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి విషయాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లారు. తదనంతరం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ప్రస్తుతం యూనివర్సిటీ సాధన కోసం ముందుకు రావడం అభినందనీయం.

– దేవిదాస్ దేశ్‌పాండే, వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు

### యువత తలుచుకుంటే..



యువత తలుచుకుంటే విశ్వవిద్యాలయం ఏర్పాటు తప్పక నెరవేరుతుంది. మేధావివర్గం, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు అండగా నిలబడాలి. వారికి ఆర్థికంగా తోడ్పాటునందించాలి.

– రమేశ్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

### వైఎస్సార్ హయాంలో మంజూరు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి జిల్లాకు జ్ఞాన సరస్వతీ యూనివర్సిటీని మంజూరు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆ ఫైల్ ముందుకు కదలలేదు. విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు దిశగా ఉద్యమించాలి.

– వరప్రసాద్, కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, బేల

### విద్యారంగ అభివృద్ధికి దోహదం..



జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో ఉన్నత విద్య కోసం ఇక్కడి వారు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. జిల్లాకు ప్రకటించిన ఇంజినీరింగ్ కళాశాలను సైతం ఏర్పాటు చేయాలి. సామాజిక స్పృహతో 'సాక్షి' ముందుకు రావడం అభినందనీయం.

– నవీన్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### భీం స్ఫూర్తితో ఉద్యమిద్దాం..



కుమురంభీం పోరాట స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలి. పక్కా ప్రణాళిక, నిరంతర పోరాటంతో ఆకాంక్ష తప్పకుండా నెరవేరుతుంది. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నించాలి.

–హనుమాండ్లు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

### విశ్వవిద్యాలయం తప్పనిసరి..



జిల్లాలో ఉన్నత విద్య అవకాశాలు లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మరికొందరు డిగ్రీతోనే ఆగిపోతున్నారు. విద్యాపరంగా అభివృద్ధి చెందాలంటే జిల్లాకు విశ్వవిద్యాలయం తప్పనిసరి.

– ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్

### ఆచరణనే ముఖ్యం..



జిల్లాలో గిరిజన యూనివర్సిటీ సాధన కోసం 2017 నుంచి ఉద్యమాలు చేస్తున్నాం. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. వర్సిటీ లేక ఈ ప్రాంత విద్యార్థులకు ఏళ్లుగా అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అందరూ ఏకతాటిపైకి రావడం శుభపరిణామం.

–వెట్టి మనోజ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

### పాలకుల నిర్లక్ష్యంతోనే..



ఇప్పటికే జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ పాలకు ల నిర్లక్ష్యంతో ఆ కల నెరవేరలేదు. గిరి జన విశ్వవిద్యాలయం మంజూరైనప్పటికీ దాన్ని ములుగుకు తరలించారు. అ లాగే గతంలో ఐఐటీ ఏర్పాటు చేస్తామని మొండి చెయ్యి చూపడంతో ఉద్య మం చేస్తే ట్రిపుల్‌ఐటీ వచ్చింది. ఇప్పటికైనా నాయకులు చిత్తశుద్ధి ప్రదర్శించాలి.

– మల్లేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

### వెనుకబాటు ముద్ర పోవాలంటే..



పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వారి పబ్బం గడుపుకోవడానికి వెనుకబడ్డ జిల్లాగా ముద్ర వేశారు. జిల్లాలో వర్సిటీ ఏర్పాటుకు సంబంధించి అన్ని అవకాశాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయం ఏర్పడితే వెనుకబడిన జిల్లా అనే అభిప్రాయాన్ని మార్చవచ్చు.

– కోల కిరణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్

### వనరులున్నా.. పట్టింపులేదు



ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎన్నో వనరులతో పాటు అన్నిరకాల యూనివర్సిటీలు ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. అయితే పాలకుల పట్టింపులేమే ప్రధాన సమస్య.

– రాజ హర్షవర్ధన్, బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ అభ్యర్థి

### అందరినీ కలుపుకొని పోవాలి..



జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు సంబంధించిన వారిని సైతం కలుపుకొని పోవాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– కె.పున్నరావు, నలంద కళాశాల ప్రిన్సిపాల్

### ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



యూనివర్సిటీ సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. భావితరం బాగు కోసం ఐక్య పోరాటాలు తప్పనిసరి. దీనికి అన్ని సంఘాలు కలిసి రావాలి.

– అగ్గిమల్ల గణేశ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

### వర్సిటీతో యువతులకు మేలు..



జిల్లాలో యూనివర్సిటీ అందుబాటులోకి వస్తే ముఖ్యంగా యువతులకు మేలు జరుగుతుంది. ఉన్నత విద్య అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

– అశ్విని, శిక్షణార్థురాలు

### మొన్న ఎయిర్‌పోర్టు.. ఇప్పుడు యూనివర్సిటీ



'సాక్షి' సామాజిక బాధ్యతగా యూనివర్సిటీ సాధన కోసం ముందడుగు వేయడం అభినందనీయం. ఇటీవల ఎయిర్‌పోర్టు గురించి డిబెట్ నిర్వహించగా, ప్రభుత్వాలు స్పందించి ముందడుగు వేశాయి. తాజాగా యూనివర్సిటీ ఏర్పాటు కూడా సాధ్యపడుతుందని ఆశిస్తున్నాం.

– పురుషోత్తం రెడ్డి, జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్

### వివక్షతతోనే వర్సిటీ దూరం..



జిల్లాలో వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు ఉన్నా పాలకుల వివక్ష కారణంగా అన్యాయం జరుగుతుంది. విశ్వవిద్యాలయం సాధన కోసం 'సాక్షి' చొరవ తీసుకొని చర్చా వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయం.

– అల్లూరి భూమన్న, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్

### మేనిఫెస్టోలో పెట్టాలి..



యూనివర్సిటీ ఏర్పాటయితే ఈ ప్రాంతవాసులు ఉన్నత చదువు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయవచ్చు. స్వరాష్ట్రం కోసం ఉద్యమించినట్టే యూనివర్సిటీ ఏర్పాటుకు పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. పార్టీల మేనిఫెస్టోలో ప్రాధాన్యత అంశం కావాలి.

– సోగల సుదర్శన్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు

### నూతన పరిశోధనలకు దోహదం..



రాష్ట్రంలో తగినన్ని యూనివర్సిటీలు లేకపోవడంతో విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్నాం. జిల్లాలో విశ్వవిద్యాలయం అందుబాటులోకి వస్తే నూతనంగా పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధికి దోహద పడుతుంది.

– సల్ల విజయ్‌బాబు, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

### ఆసక్తి ఉన్నా.. అందుబాటులో లేక



ఉన్నత విద్యపై ఆసక్తి ఉన్నా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సమస్యగా మారుతోంది. ఆర్థిక పరిస్థితుల తో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లడం కొంత ఇబ్బందికరం. ఈ కారణంగానే జిల్లాలో యువతులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

– అరవింద, బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ అభ్యర్థి

## న్యూస్‌రీల్

### సమ్మె జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: కార్మికసంఘాల ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ కోరారు. జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు.కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కిష్టన్న, వి.అశోక్, కోశాధికారి కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఎ.స్వామి, గౌస్ మొహియుద్దీన్, శివన్న, గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

**సంఘీభావం ప్రకటించాలి**

నేటి సార్వత్రిక సమ్మెకు పెన్షనర్లు సంఘీభావం ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఇందులో దయాకర్ రెడ్డి, బాపురావు, అశోక్, దేవిదాస్, రాజవర్ధన్, ఉమాకాంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

- కలెక్టర్ రాజర్షి షా

బోథ్: వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం బోథ్ సీహెచ్‌సీని సందర్శించారు. త్వరలోనే బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను



మొక్క నాటుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. అనంతరం పొచ్చెరలో మొక్కలు నాటారు. గ్రామస్తులు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమాల్లో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఈవో శ్రీనివాస్ ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, ఎంపీడీవో రమేశ్, ప్రిన్సిపాల్ సంగీత, తదితరున్నారు.

### హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్ సర్వీస్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ (జేబీఎస్)కు ఈనెల 10 నుంచి నాన్ స్టాప్ సర్వీస్ ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీస్ ఉదయం 4.45 గంటలకు ఆదిలాబాద్ నుంచి ప్రారంభమై నేషనల్ హైవే 44 మీదుగా ప్రయాణించి 10.15 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడి నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్‌కు 11.15 గంటలకు చేరుకుంటుందని వివరించారు. https:// www. tgsrtcbus. in వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### జిల్లాలో కొత్త ఎంపీడీవోలు

- పలువురికి స్థానచలనం
- కొన్నిచోట్ల ఎంపీవోలకు ఇన్‌చార్జి బాధ్యతలు

కైలాస్‌నగర్: జిల్లాలో కొన్ని మండలాలకు కొత్త ఎంపీడీవోలు నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తూ సొంత జిల్లాలకు బదిలీ అయిన ఆయా స్థానాల్లో ఆయా మండలాల్లోని ఎంపీవోలు, సూపరింటెండెంట్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన ఏ.భూమయ్యను మావల ఎంపీడీవోగా నియమించారు. అలాగే తలమడుగు ఎంపీడీవోగా ఉన్న శేఖర్‌ను నేరడిగొండకు బదిలీ చేశారు. ఇక ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవోగా ఎంపీవో స్వప్నశీల, తలమడుగు ఎంపీడీవోగా సూపరింటిండెంట్ శంకర్, జైనథ్ ఎంపీడీవోగా ఎంపీవో మహేశ్‌కుమార్, ఇచ్చోడ ఎంపీడీవోగా ఎంపీవో ఆనంద్‌స్వామి, గుడిహత్నూర్ ఎంపీడీవోగా సూపరింటిండెంట్ మాణిక్ ప్రభుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వీరిలో పలువురు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- మహానేత సేవలను స్మరించుకున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత దివగంత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ అని మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుడిపల్లి నగేశ్ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు హాజరై వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదలకు, పీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఆదిలాబాద్‌కు రిమ్స్‌తో పాటు పలు ప్రాజెక్టులను తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని గుర్తు చేశారు. ఇందులో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, నాయకులు గిమ్మ సంతోష్, ఆనంద్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, దేవిదాస్‌చారి, సంజయ్‌రెడ్డి, శ్రీలేఖ, షబానా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### దేశీదారు విక్రేత బైండోవర్

ఇచ్చోడ: దేశీదారు విక్రయిస్తున్న సొనాల మండలంలోని గుట్ట పక్క తాండకు చెందిన మట్ట చందర్‌సింగ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సదరు వ్యక్తి దేశీదారు విక్రయిస్తుండగా పలుమార్లు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అయినా మానలేదన్నారు. జరిమానా డబ్బులను చలానా రూపంలో ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

### ముగ్గురిపై పిచ్చికుక్క దాడి

దహెగాం: మండల కేంద్రంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న కొత్తపల్లికి చెందిన తొడిషం శంకరి, నార వెంకటేశం, లక్ష్మిపై దాడి చేసి గాయపర్చడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్కల బారినుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

### ఒకరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఓ వెల్డింగ్ షాపులో బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. ఉట్నూర్ సహాయ కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సెడ్మకి దేవుబాయి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా వెల్డింగ్ షాప్‌లో బాలుడు పనిచేస్తూ కనిపించడంతో వివరాలు సేకరించారు. బాలునికి 16 సంవత్సరాలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో షాప్ నిర్వాహకుడు షేక్ రేహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### మోసగించిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగి కొండూరి గంగాధర్‌పై మరో రెండు కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఇంటి స్థలాలు ఇస్తానని మోసం చేసిన కేసులో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన దాసరి అనసూయ నుంచి 1996లో కొండూరి గంగాధర్ రూ.5వేలు తీసుకొని సర్వే నం.346లో ప్లాట్ నం.304–ఏ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇటీవల అది నకిలీ పట్టా అని తేలడంతో అతనిపై ఫిర్యాదు చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన అనుముల శ్రీనివాస్‌కు సర్వే నం.346లో 304 నకిలీ పట్టా చేసి ఇచ్చాడు. ఒకే ప్లాట్‌ను నకిలీ పట్టాలతో ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో కొంత కాలంగా అనుసూయ, శ్రీనివాస్ మధ్య గొడవ జరుగుతోంది. వీరిద్దరి సమస్యను పరిష్కరించేందుకు శ్రీనివాస్ వద్ద నుంచి గంగాధర్ రూ.లక్ష డిమాండ్ చేశాడని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

### నాలుగిళ్లలో చోరీ

భైంసా: బాసరలోని బొర్ర గణేశ్‌కాలనీలో సోమవారం రాత్రి నాలుగిళ్లలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన దావు సంతోశ్, రాజు, పెద్ద రాజన్న, మైలాపూర్‌లోని పోశెట్టి ఇంట్లో దొంగలు చొరబడి బియ్యం సంచులు, సీలింగ్ ఫ్యాన్లు, ఓ ద్విచక్రవాహనం ఎత్తుకువెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఇటీవలే భైంసా మండలంలోని కుంసరలో నాలుగిళ్లలో ఇలాగే చోరీ జరిగింది. వరుస ఘటనలతో ఈ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



# నేడే సార్వత్రిక సమ్మె

- సింగరేణిలో ఏకమైన కార్మిక సంఘాలు
- విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపు
- లేబర్ కోడ్‌లతోపాటు సింగరేణి పరిధిలో డిమాండ్లు



సమ్మెకు సిద్ధమంటూ నినాదాలు చేస్తున్న ఎస్సార్పీ 1 గని కార్మికులు

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జరగనుంది. ఈ సమ్మెను సింగరేణిలో విజయవంతం చేసేందుకు కార్మికసంఘాలన్నీ ఏకమయ్యాయి. కొద్ది రోజులుగా సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి గనులపై విస్తృత ప్రచారం నిర్వహించాయి. బీఎంఎస్ మినహా అన్ని సంఘాలు సమ్మెకు 'సై' అనడంతో సింగరేణిలో సమ్మె అనివార్యమైంది. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీతో పాటు సీఐటీయూ, టీబీజీకేఎస్ కలిసి సింగరేణి కార్మిక సంఘాల జేఏసీగా ఏర్పడ్డాయి. హెచ్‌ఎంఎస్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఏన్టీయూసీ సంఘాలు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పేరుతో మరో జేఏసీగా ఏర్పడి సమ్మెలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయి. ఇదిలా ఉంటే మే 20వ తేదీనే ఈ సమ్మెకు పిలుపునిచ్చిన సంఘాలు ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో జూలై 9వ తేదీకి వాయిదా వేశారు.

**సింగరేణిలో డిమాండ్లు**

దేశ వ్యాప్తంగా బ్యాంకులు, బొగ్గు సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు అసంఘటిత రంగాల్లో కూడా ఈ సమ్మెకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె డిమాండ్ ఉంది. కానీ సింగరేణిలో ఈ లేబర్‌కోడ్‌లతో పాటు ఇతర డిమాండ్లను కూడా చేర్చి జేఏసీ నేతలు కొద్దిరోజుల క్రితం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించారు.

- కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపు పన్ను కంపెనీ చెల్లించాలి.
- కార్మికులకు సొంతింటి పథకం అమలు చేసి ఇంటి స్థలంతో పాటు రూ.25 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి.
- తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి కేటాయించాలి
- కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి.

**సమ్మెకు బీఎంఎస్ దూరం**

ఈ సమ్మెకు జాతీయ సంఘమైన బీఎంఎస్ దూరంగా ఉంది. మే 20న సమ్మెకు పిలుపునిచ్చినప్పుడు దేశంలో యుద్ధవాతావరణం నెలకొంది. ఇలాంటి సమయంలో సమ్మె చేయడం సరికాదని, అందుకే సమ్మెకు దూరంగా ఉంటున్నామని తెలిపింది. సమ్మె వాయిదా పడటంతో నేడు ఈ సమ్మె రాజకీయ ప్రేరేపిత సమ్మె అని, తాము సమ్మెకు దూరంగా ఉంటున్నామని, కార్మికులు పాల్గొనవద్దని ఆ సంఘం నాయకులు ప్రకటన చేశారు.

**వద్దంటున్న యాజమాన్యం..**

ఈ సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని సింగరేణి యాజమాన్యం కోరింది. ఈ మేరకు అన్ని ఏరియాల జీఎంలు, కార్మికులు రోజువారిలాగానే నేడు విధులకు హాజరుకావాలని కోరింది. సమ్మె డిమాండ్లు తమ పరిధిలో లేవని, జాతీయ స్థాయి సమస్యలపై సింగరేణిలో సమ్మె చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దని ప్రకటించింది.

# వాగు దాటితేనే వైద్యం

- అర్ధరాత్రి అస్వస్థతకు గురైన చిన్నారి
- ప్రాణాలకు తెగించి వరదదాటి ఆస్పత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- వంతెన నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



అర్ధరాత్రి చిన్నారితో వాగు దాటుతున్న దంపతులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వాగులు, ఒర్రెలపై వంతెనలు లేకపోవడంతో ఆదివాసీలకు రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తిన అత్యవసర సమయాల్లో ప్రాణాలు పణంగా పెట్టి వరద దాటితేనే వైద్యం అందుతోంది. ఇంద్రవెల్లి మండలం మండలంలోని మామిడిగూడ(బి), మామిడిగూడ(జి) గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన లేదు. మామిడిగూడ(బి) గ్రామానికి చెందిన ఉయిక స్వప్న, గోవింగ్ రావ్ దంపతుల కుమార్తె సోమవారం రాత్రి కడుపు నొప్పితో బాధపడింది. కుటుంబ సభ్యులు రాత్రి పూట చిమ్మచీకటిలోనే ఓ చిన్నలైటు, గ్రామస్తుల సాయంతో వాగు దాటారు. ఆటో సాయంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చిన్నారికి చికిత్స అందించారు. తమ గ్రామానికి పక్కా రోడ్డు, వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నాలుగు నెలలపాటు ప్రాణాలకు తెగించి వరద నీటితో సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా వంతెన, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

### వాగు దాటి.. వైద్యం అందించి..



వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడకు వెళ్లాలంటే మధ్యలో ఉన్న వాగు దాటాల్సిందే. మంగళవారం ఏఎన్ఎంలు విజయసుందరి, దివ్య, వైద్య సిబ్బంది వాగు దాటి జెండాగూడకు వెళ్లి రోగులు, బాలింతలు, గర్భిణులకు వైద్యం అందించారు. ఇంటింటా తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించారు.

# ఖజానా చెరువును ఈదేశాడు..

- నిర్మల్ వైద్యుడి ఘనత
- భారతదేశ చిత్రపటం ఆకృతిలో స్విమ్మింగ్
- ఐరన్‌మ్యాన్ చాలెంజ్–2025కు సన్నద్ధం



ఈదుతున్న వైద్యుడు బీఎల్ నర్సింహారెడ్డి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.లక్ష్మీనర్సింహారెడ్డి చారిత్రక ప్రాశస్త్యం ఉన్న గొలుసుకట్టు చెరువుల్లోని ఖజానా చెరువులో సుమారు 40 నిమిషాల్లో కిలోమీటర్ దూరం మేర ఈత ద్వారా ఆరోగ్య ప్రాధాన్యత, ప్రత్యేకతను చాటారు. రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి వాటిల్లో ఆయన ప్రత్యేక నైపుణ్యం సాధించారు. ప్రతీరోజు ఈత అభిరుచిగా మారింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో అలనాటి నిమ్మ నాయుడు కాలం నుంచి గొలుసు కట్టు చెరువుల్లో చారిత్రక ఖజానా చెరువుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వెంకటాద్రిపేట్ సమీపంలోని ఈ చెరువులో మంగళవారం ఈత కార్యక్రమాన్ని చేపట్టిన ఆయన సరిగ్గా 41 నిమిషాల్లో 919 మీటర్ల మేర దూరాన్ని అవలీలగా ఈదారు. జియోట్యాగింగ్ ద్వారా ఆయన స్విమ్మింగ్ చేసిన మార్గం అచ్చు భారతదేశ చిత్రపటం ఆకృతిని పోలి ఉండడం గమనార్హం. గోవాలో వచ్చే నవంబర్ 9న అరేబియా సముద్రంలో నిర్వహించే ఐరన్ మ్యాన్ స్విమ్మింగ్ చాలెంజ్–2025లో విజయమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో నెదర్లాండ్స్ దేశంలోని ఆమ్‌స్టర్‌డమ్‌లో నిర్వహించిన మారథాన్ రన్ లోనూ 34.8 కిలోమీటర్ల దూరం పరుగెత్తి పురస్కారం అందుకున్నారు. సైక్లింగ్‌లోనూ అభిరుచి కలిగిన ఆయన నిర్మల్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు పాలజ్ గణేశ్ ఆలయానికి దాదాపు 75కిలోమీటర్ల దూరం, నిర్మల్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ సూర్య దేవాలయం వరకు దాదాపు 200 కిలోమీటర్ల పైగా లక్ష్యాన్ని చేరుకున్నారు. ఒక వైద్యుడిగా రోగులకు సేవలందించే ప్రయత్నంలో ఆరోగ్యంపై పలు విధాలుగా చైతన్యవంతం చేస్తాం. ఇందులో భాగంగానే ఫిట్నెస్ అవగాహన కోసం స్వీయంగా ఆచరిస్తూ ఇతరులకు చెప్తే బాగుంటుందని ఉద్దేశంతోనే ఇవన్నీ చేస్తున్నాను...' అని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు.

### పూసాయివాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న సిల్వర్ దేవన్న

సాత్నాల: భోరజ్ మండలంలోని పూసాయికి చెందిన సిల్వర్ దేవన్న మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సోషల్ ఎకానమీ అండ్ హెల్త్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రైమెటివ్ ట్రైబ్స్ ఎస్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగానూ ఆయన డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం దేవన్న ఉట్నూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు.

### నిజాయతీ చాటుకున్న విజయ్



ఎస్పీకి నగదు అప్పగిస్తున్న విజయ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన విజయ్‌కుమార్ తనకు దొరికిన రూ.2.48 లక్షల నగదును పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. మంగళవారం బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక కోర్టువద్ద ఓ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అనుకోకుండా నగదును కింద పడేసుకున్నాడు. గమనించిన విజయ్ పోలీసులను సంప్రదించి నగదు అప్పగించాడు. ఈ సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిల విజయ్‌ను అభినందించారు.

### రెండోరోజు కొనసాగిన కౌన్సెలింగ్



అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం రెండోరోజు కౌన్సెలింగ్ కొనసాగింది. క్రమసంఖ్య 565 నుంచి 1128 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు రోజుల్లో 1,128 మందికి గానూ 989 మంది విద్యార్థులు హాజరయ్యారు. 139 మంది విద్యార్థులు రెండు రోజుల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోయారు. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలో వెకెంట్ లిస్టు ఆధారంగా భర్తీ చేస్తామని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనుంది.

### మద్యం విక్రేతపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీరామ్ కాలనీలో గల ఓ హోటల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న లంకాడే సత్యనారాయణపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వైన్స్‌షాపు నుంచి మద్యం తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు తనిఖీ చేయగా పది మద్యం బాటిళ్లు లభించినట్లు వివరించారు.

### ముగ్గురి రిమాండ్

సాత్నాల: భోరజ్ మండలంలోని పెండల్వాడలో భవునే రవి ఇంట్లో దేశీదారు విక్రయిస్తున్నారని సమాచారంతో మే 12న తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ ఎస్సై వైద్య వెంకటేశ్వర్, ఆరుగురు సిబ్బందిపై బావునే నమిత, బావునే మనీషా, బావునే సుమన్ భాయ్ దాడికి పాల్పడ్డారు. ఎక్సైజ్ ఎస్సై వైద్య వెంకటేశ్వర్ ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.

# వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత రైతులు

లక్సెట్టిపేట: రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారి డబ్బులు చెల్లించకుండా ఐపీ పెట్టడంతో బాధితులు మంగళవారం బీట్ బజార్‌లోని వ్యాపారి ఇంటిఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సదరు వ్యాపారి రైస్‌మిల్లు నిర్వహిస్తూ దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొందరి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. సుమారు రూ.7 కోట్లు అప్పులు కావడంతో రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి ఐపీ తీసుకుని బాధితులకు పంపించాడు. కోర్టు నోటీసు తీసుకున్న బాధితులు వ్యా పారి ఇంటి ఎదుట ధర్నాకు వచ్చి ఇట్టి ఇల్లు రైతులకు చెందినదని బోర్డు రాసి పెట్టారు. సుమారు 195 మంది బాధితులు నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని బాధితులను పంపించారు.

### సమర్థవంతంగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు



పురస్కార గ్రహీతలతో ఆర్‌ఎం భవాని ప్రసాద్

ఆదిలాబాద్: సమర్థవంతంగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు సాధ్యమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవాని ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం పలువురు ఉద్యోగులకు ప్రగతి చక్ర పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే ఉద్యోగులకు ఎప్పుడూ సంస్థ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఉద్యోగులు విధుల్లో చూపిస్తున్న నిబద్ధతే సంస్థను ముందుకు నడుపుతోందన్నారు. ప్రగతి చక్ర పురస్కారాలు ఉద్యోగుల్లో మనోస్థైర్యాన్ని సైతం పెంపొందిస్తాయన్నారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే సంస్థ ప్రగతి పథంలో ముందుకెళ్తుందన్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం(ఎం) రామయ్య, డీఎం ప్రతిమా రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సుంకిడి గ్రామానికి చెందిన కుంటల ఆశన్న (53) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మ ద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు.

### పురుగుల మందు తాగి యువకుడు..

తలమడుగు: ఝరిపునాగూడకు చెందిన మేస్రం అనిల్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు.

### దొంగలను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల ఫొటోలు

చెన్నూర్: మండలంలోని సుబ్బారాంపల్లిలో వృద్ధురాలి మెడలోని గొలుసు దొంగిలించిన వారిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మంగళవారం సీసీ ఫుటేజీ చిత్రాలను విడుదల చేశారు. గుర్తిస్తే 8712656553 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

# గవర్నర్‌ను కలిసిన మాజీ ఎంపీ 'సోయం'



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాపూరావు

కైలాస్‌నగర్/ఆసిఫాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49 రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ సోయం బాపూరావు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 49 ఆదివాసీ హక్కులను కాలరాసేలా ఉందని, వెంటనే రద్దుచేసి ఆ ప్రాంతంలో నివసించే గిరిజన, గిరిజనేతరులకు స్వేచ్ఛ కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్‌లో కలపడంతో అడవులు, అటవీ భూములను నమ్ముకుని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో జారీ చేయడం సరికాదన్నారు. ఈ జీవో కారణంగా 339 ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదివాసీ గిరిజనులకు న్యాయం చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ గోండ్వానా మహాసభ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు, జిల్లా మేడి కుర్సంగే మోతిరాం, రాజ్‌గోండ్ రాష్ట్ర కార్యదర్శి పెందూర్ సుధాకర్, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

# సబ్సిడీ ఎరువులు తరలిస్తున్న ఐదుగురిపై కేసు



సీజ్ చేసిన వాహనాలతో డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులను అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి రెండు వాహనాలను జైనథ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బేల మండలం మార్క్‌ఫెడ్ అనుబంధ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ప్రొప్రైటర్ సునీల్, ఉద్యోగి అజయ్ మహారాష్ట్రకు చెందిన ఫర్టిలైజర్ దుకాణ యజమాని నిఖిల్‌తో ఒప్పందం కుదుర్చుకుని రూ.3 లక్షలు విలువ చేసే 150 బ్యాగుల యూరియాను రెండు వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్లు వంకాడే దిలీప్, చిలకలవార్ చంద్రశేఖర్‌తో పాటు సునీల్, అజయ్, నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సై నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కుదించి తీసుకువచ్చిన నాలుగు కోడ్‌లు, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో తొడసం నాగోరావ్, కుమ్ర చంద్రకళ, రఘురాం, అమృత్‌రావ్, మానిక్‌రావ్, గేడం భరత్, జుగ్నాక్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

### కోడలును వేధించిన మామకు ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికంగా కోడలును వేధించిన మామకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంపీ.రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. సిర్పూర్(టి) మండలం చీలపెల్లి గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మణ్‌కు 2015లో హత్య కేసులో కోర్టు 14ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆరేళ్ల జైలు జీవితం అనంతరం బెయిల్‌పై వచ్చాడు. లక్ష్మణ్ భార్య గతంలో చనిపోగా రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్య కూడా చనిపోయింది. ఈ క్రమంలో కోడలిని అసభ్య పదజాలంతో దూషిస్తూ లైంగిక వాంఛ తీర్చాలని అసభ్యకరంగా ప్రవర్తించాడు. గత ఏడాది అక్టోబర్ 7న బాధితురాలి ఫిర్యాదు మేరకు సిర్పూర్(టి)లో కేసు నమోదైంది. ఎస్సై కమలాకర్ కేసు దర్యాప్తు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు, సీడీవో అండ్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేశ్, ఎస్సై కమలాకర్, సీడీవో బాలాజీని ఎస్పీ అభినందించారు.

### పులి దాడిలో లేగదూడ హతం



లేగదూడను పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారు అటవీప్రాంతంలో పెద్దపులి దాడిలో లేగ దూడ మృతి చెందింది. బెల్లంపల్లి అటవి రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం మండలంలోని వెంకటపూర్‌కు చెందిన రైతు బుద్దె రాజలింగు తన లేగ దూడ పులి దాడిలో మృతి చెందిందని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సమీపంలో కుంట వద్ద పెద్దపులి అడుగులు ఉన్నట్లు గుర్తించారు. పెద్దపులి సంచరిస్తున్నందువల్ల వెంకటాపూర్, లక్ష్మీపూర్, మల్కేపల్లి, సోనాపూర్ గ్రామాల ప్రజలు పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని సూచించారు. పశువుల కాపారులు అడవిలోకి వెళ్లవద్దన్నారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

### చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి గల్లంతు

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్‌కు చెందిన అడేల్ల రఘు తన మిత్రుడు శ్రావణ్‌తో కలిసి చేపలు పట్టడానికి ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. ప్రాజెక్టు దిగువ భాగంలో చేపలు పడుతుండగా లోతు ఎక్కువగా ఉండడంతో ఈతరాక నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జాలర్లతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై ప్రణయ్ కుమార్ తెలిపారు.